
కథ

# ఒకరోజు రాణి

— 'పుష్యమి'



కిరణా కొట్టు కుర్రాడు ఒకో ఐటమ్ చదువుతూ, ఓ పక్కకి సర్దుతున్నాడు.

జాహ్నవి తన చెతిలో వున్న చీటీతో ఆ వస్తువులను చెక్ చేసుకుంటోంది. ఒక పక్క నుంచి మానస, నిషాంత్ గొడవ చేస్తున్నారు. ''అమ్మా, లిటిల్ హార్ట్స్ ఎన్నిప్యాకెట్స్ తీసుకుంటున్నావు?'' అని.

''అబ్బా, ఇంటి కెళ్ళేంత వరకూ ఆగలేర్రా'' అని కసురుతూనే యధాలాపంగా పక్కకు తిరుగింది.

ఆమె భర్త రామ్మోహన్ ఆ షాప్ దరిదాపుల్లో ఎక్కడాలేడు.

ఏ సిగరెట్ కాల్చుకోవడానికైనా పక్కకి వెళ్ళాడేమోననుకుంది జాహ్నవి.

అదృష్టవశాత్తూ ఆమె హ్యాండ్ బ్యాగ్‌లో డబ్బులుండబట్టి బిల్లు చెల్లించేసింది. వెచ్చాలున్న బ్యాగ్ పిల్లల సాయంతో తీసుకొచ్చి స్కూటర్ సీటు ముందు భాగంలో వుంచింది.

రోడ్డు మీదకి చూసింది జాహ్నవి. సాయంకాలం ఏడు గంటలు కావడంతో ట్రాఫిక్‌తో రద్దీగా వుంది. 'నకులుడు చినుక్కీ చినుక్కీ మధ్య తడవకుండా రథం నడిపేవాడట. అలాంటి వాణ్ణి తీసుకొచ్చి ఈ హైదరాబాద్ రోడ్ల మీద వదిలెయ్యాలి. అప్పుడు తెలుస్తుంది మాజా' అని నవ్వుకుంది.

నెల మొదటివారం -

ఆ ఎఫెక్ట్ జనరల్ స్టోర్స్ అన్నింటి దగ్గరా కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. జనమే జనం -

రామ్మోహన్ ఎక్కడకు వెళ్ళాడు?

ఆమె కళ్ళు మళ్ళీ వెదికాయి.

ఆ పక్కనే వున్న గ్రీటింగ్ కార్డ్స్ షాప్ నుంచి వస్తున్న రామ్మోహన్ కనబడ్డాడు.

ఇంత అర్జెంట్‌గా గ్రీటింగ్ కార్డ్స్‌తో పనేమిటి?

దగ్గర్లో పండగకాని, న్యూ ఇయర్ డే గాని లేదే?

భర్త స్కూటర్ దగ్గరకు రాగానే అడిగింది.

''ఎవరి బర్త్‌డే?''

''ఏమిటి?'' అర్థంకాక అడిగాడు రామ్మోహన్.

''అదే - బర్త్‌డే గ్రీటింగ్ కార్డ్ కొనడానికి వెళ్ళారుగా?''

స్కూటర్ స్టార్ట్ చేశాడు. ''నేనేమీ గ్రీటింగ్ కార్డ్ కొనలేదుగా! జస్ట్, చూడటానికి వెళ్ళాను - అంతే'' రామ్మోహన్ స్వరంతో ఏదో తేడా వుంది - అబద్ధం చెబుతున్నట్లుగా.

ఆసక్తి వంటి అనుమానం జాహ్నవి మదిలో మొలకలు వేసింది.

రామ్మోహన్ అబద్ధం చెప్పాడు.

ఇందాక అతని చేతిలో వున్న పుస్తకంలో ఓ గ్రీటింగ్ కార్డ్ కనబడింది.

అదెవరికి?

★ ★ ★

ఆ రోజు రాత్రి అతని పుస్తకాల రాక్ వెదికింది జాహ్నవి. కాలేజి రోజుల నుంచి రామ్మోహన్ కొని దాచుకున్న పుస్తకాలు ఎన్నెన్నో...

ఓ కవితా సంపుటిలో కనబడిందా గ్రీటింగ్ కార్డ్. కవర్ తెరిచి చూసేలోపల జాహ్నవి భుజం మీద రామ్మోహన్ చేయపడింది.

''ఎందుకు జూహీ - ఈ వెదుకులాట? నా మీద అనుమానమా?'' నవ్వుతూ అడిగాడు రామ్మోహన్.

''మన పెళ్ళయి ఏడేళ్ళు ఎప్పుడో దాటిందిగా - మిమ్మల్ని ఈ మధ్య ఏమన్నా తేనెటీగలు కుడుతున్నాయేమోనని'' కవర్ తెరిచే ప్రయత్నంలో వుంది జాహ్నవి.

''నీకెందుకది? భార్యా భర్తలన్నాక కొన్ని రహస్యాలయినా వుండాలి?'' లాక్కోబోయాడు రామ్మోహన్.

''ఇలాంటి విషయాల్లోనా?''

''కావాలంటే నువ్వు కూడా గ్రీటింగ్ కార్డ్స్ కొనుక్కో - నేను చస్తే చూడనుగా, అఫ్ కోర్స్ నువ్వు చూపించేంతవరకూ''

ఇద్దరి పెనుగులాటలో గ్రీటింగ్ కార్డ్ జాహ్నవి చేతుల్లోకి వచ్చి పడింది.

ఆ కార్డ్‌లో రాసి వుంది -

''మోర్ దెన్ ఐ కెన్ సే ఆర్ షో
మోర్ దెన్ యూ విల్ ఎవర్ నో
హ్యాపీ యానివర్సరీ డార్లింగ్!
ఐ లవ్ యూ!''

''నీ చేజేతులారా రేప్రొద్దున్న థ్రిల్ అయ్యే ఛాన్స్ చంపేసుకున్నావుగా?'' తల పట్టుకుంటూ అన్నాడు రామ్మోహన్.

అప్పుడు గుర్తొచ్చింది జాహ్నవికి ఆ మరుసటి రోజే పెళ్ళిరోజు అని.

''సారీ! నేను మర్చిపోయానండీ'' చెప్పింది జాహ్నవి.

''నీ మతి మరుపుకి ఒక రకంగా. పిచ్చ హ్యాపీ! ఎందుకంటే - వారం రోజుల ముందు నుంచి చీరో, మరేదో కొనిమ్మని అడిగే ఛాన్స్ పోగొట్టుకున్నావు! నాకా బాధ తప్పింది.

మరో రకంగా నిన్ను చూస్తే అసూయ వేస్తుంది - జీవితంలో చేదుగతాన్ని, పీడకలల్లాంటి రోజులను మర్చిపోవడం ఏ కొద్ది మంది అదృష్టవంతులకో సాధ్యమవుతుంది. అందులో నువ్వు వుండటం నాకు ఆనందం!

వచ్చే ఏడాదికి మన పెళ్ళి రోజును మర్చిపోవడానికి మ్యాగ్జిమం నా కృషి నేను చేస్తాను అన్నాడు రామ్మోహన్.

''ఏయ్! మన పెళ్ళి పీడకల, అని నేనెప్పుడయినా అన్నానా?'' అని మొట్టికాయ వేసింది జాహ్నవి.

''అప్పుడప్పుడూ గొణుక్కుంటుంటావుగా! ఈ పెళ్ళి ఎందుకు చేసుకున్నానురా దేవుడా - ఎప్పుడూ పని పని'' గుర్తు చేశాడు. రామ్మోహన్.

''ఎప్పుడో పని ఎక్కువైనప్పుడు... విసుగు పుట్టి! చికాకునైనా బయటకు చెప్పకూడదా?''

''వైనాట్! ఇంతకీ రేపేం కావాలో అడగవే?'' అన్నాడు రామ్మోహన్.

ఒక నిమిషం పాటు ఆలోచించి, తర్వాత చెప్పింది జాహ్నవి.

''నవ్వకూడదు. అవమానంగా భావించకూడదు''.

''ఏంటోయ్ షరతులు విధిస్తున్నావ్?''

''జీవితాంతం మగవాళ్ళ ఆదుపాజ్ఞల్లో బ్రతికే ఆడవాళ్ళం, మాకేం షరతులుంటాయి - వేడికోళ్ళు విన్నపాలు తప్ప''

''వ్యంగ్యమా?'' టాపిక్ సీరియస్‌గా మారుతుందని అనుమానం వచ్చి అడిగాడు రామ్మోహన్.

''కాదు - వాస్తవమే!''

''జూహి, మనిద్దరి మధ్య ఈ చర్చలెందుకు గాని, అసలు విషయం చెప్పేసేయ్! నువ్వు ఏమడిగినా, నేను కాదనను''.

''పొద్దున్న లేచినప్పటి నుంచి ఇంటి పనులు చేసి చేసి అలసి పోయాను, రేపు ఒక్క రోజు మాత్రం ఇటు పూచికపుల్ల అటు తీసిపెట్టను.

పొద్దున్నే అంట్లు తోముకోవడం దగ్గర నుంచి కాఫీలు, టిఫిన్లు, భోజనాలకు అవసరమైనవి వండటం, బట్టలు ఉతుక్కోవడం, గదులు వూడ్చుకోవడం, పిల్లల అవసరాలన్నీ చూసుకోవడం... అన్ని మీరే చేయాలి! ఎల్లుండి నుంచి ఎలాగూ నేనే!

రేపు మాత్రం నన్ను రెస్ట్ తీసుకుని ఎంజాయ్ చేయనివ్వండి!'' జాహ్నవి కోరికకు విస్తుపోయాడు రామ్మోహన్.

అయినా తను చేసిన వాగ్దానం గుర్తుండటంతో ''నువ్విలాంటి 'జంబ లకిడి పంబ' స్కీమ్ పెడతావంటే మాట యిచ్చేవాణ్ణే కాదే!'' అని నవ్వేశాడు.

''ఎట్టి పరిస్థితుల్లో ఎగ్గొట్టకూడదు సుమా!''

ఆమె పెదవులపై ప్రామిస్ చేశాడు రామ్మోహన్.

★ ★ ★

సింక్ దగ్గర అంట్లు తోముతూ, మరోవైపు గ్యాస్ స్టౌ మీద కాఫీ, పాలు కాస్తూ అష్టావధానం చేస్తున్నాడు రామ్మోహన్.

కిచెన్‌రూమ్ ఎదురుగా వున్న డైనింగ్ టేబుల్ దగ్గర కూర్చుని ఆ రోజు పేపర్ తాపీగా చదువుతూ జాహ్నవి ''కాఫీ రెడీ కాలేదా?'' అని ఓ కేక వేసింది.

''ఏక్ మినిట్'' అన్నాడు రామ్మోహన్.

''ఏక్ మినిట్ అంటూ లేట్ చేస్తే ఏకుతాను'' అంది జాహ్నవి.

''ఏయ్, నేను నిన్నెప్పుడయినా అలాంటి మాటలన్నానా? అన్ పార్లమెంటరీ లాంగ్వేజ్ ఉపయోగించకూడదు'' అన్నాడు రామ్మోహన్.

ఈలోగా లేచిన పిల్లలు ఆ సీన్ చూసి ఒక్క క్షణం ఆశ్చర్యపోయినా, తర్వాత ఎంజాయ్ చేయడం ప్రారంభించారు.

ఎలాగయితేనే కష్టపడి సేమ్యా పాయసం, (పెళ్లి రోజు కాబట్టి), చపాతీలు చేశాడు.

కూర లేకుండా చపాతీ ఎలా తినడం అని గునిసింది జాహ్నవి.

పిల్లలు టిఫిన్ తిన్నాక, ఎవరి ప్లేట్లు వాళ్ళే కడుక్కోవాలని రూల్ పెట్టాడు రామ్మోహన్.

''ఇలా పిల్లలకు చిన్నప్పటి నుంచి ఎవరి పనులు వాళ్ళే చేసుకోవడం నేర్పించాలి. ఆడా, మగా తేడా లేకుండాపని చేయాలి. ఓ డిసిప్లిన్డ్‌గా వుంటుంది'' అని క్లాస్ కూడా ఇచ్చాడు.

''చూశారా - ఒక్క రోజు వంట చేయాల్సి వచ్చేటప్పటికి మీ సౌకర్యం కోసం ఎన్ని రూల్స్ పెట్టుకున్నారో?''

''దిగితేగాని లోతు తెలియదంటారుగా - రేపు నీకయినా పిల్లలు యింటి పనుల్లో హెల్ప్‌ఫుల్‌గా వుంటారని'' చెప్పాడు రామ్మోహన్.

''సరే - మన పెళ్ళి రోజు కదా, స్పెషల్స్ ఏమిటి?'' అంది జాహ్నవి.

''కుక్కర్‌లో అన్నం వండేస్తాను. చారు కాయగలను. పెరుగూ, పచ్చళ్ళూ ఎలాగూ వుంటాయిగా?''

''అంతేనా?''

''అఫ్‌కోర్స్, కాలేజి రోజుల్లో కోడిగుడ్డు పొరటు వండటం గుర్తుంది, గుర్తున్నంత వరకూ వండేస్తాను. మర్చిపోతే బోల్డంత విశాల హృదయంతో ఎడ్జస్ట్ అయిపోవాలి''.

''జీవితమంటేనే ఎడ్జస్ట్‌మెంట్ కదా - ఇక వంకేముంది?'' అనేసింది జాహ్నవి.

పది - పదిన్నర మధ్యలో రామ్మోహన్ వంట ప్రయత్నాలు ప్రారంభించబోయే సమయంలో రామ్మోహన్‌కి బంధువులు కమ్ ఫ్రెండ్స్ ముగ్గురు వచ్చి పడ్డారు. గ్రీట్ చేసి, ''ఏరా - మాకేమీ పార్టీ లేదా?'' అన్నారు వాళ్ళూ వచ్చీ రాగానే.

''వై నాట్, ష్యూర్'' అని వారితో కబుర్లలో పడ్డాడు రామ్మోహన్.

పన్నెండు కావస్తుండగా రామ్మోహన్ బెడ్ రూమ్‌లోకి వచ్చి, జాహ్నవితో చెప్పాడు. ''నువ్వు పిల్లలు త్వరగా రెడీ కండి! అందరమూ కలిసి ఏదన్నా రెస్టారెంట్‌లో భోంచేద్దాం''.

కనుబొమ్మలు ముడివేసింది జాహ్నవి.

''అఫ్‌కోర్స్, మరి నాకు వంట బాగా రాదుగా - పైగా వారి ముందే చేయడం కాస్త నామోషీగా వుంటుందని''

గబగబా వంట గదిలోకి నడిచింది జాహ్నవి ''ఏడుగురమూ రెస్టారెంట్‌కి వెళ్ళితే ఎంతవుతుందో తెలుసా?'' మాట్లాడలేదు. రామ్మోహన్ అన్ని రోజుల్లాగే ఆ రోజు కూడా తన రొటీన్‌లో పడి-పోయింది జాహ్నవి.